నియోజకవర్గ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పోడూరు: కవిటంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



పెనుమంట్ర: మాముడూరులో మహిళలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పోడూరు: నియోజకవర్గ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కవిటం గ్రామంలో ప్రభుత్వ నిధులు సుమారుగా రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న నాలుగు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ చుట్టుగుల్ల పూర్ణిమ, సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుక్కల సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాలి

పెనుమంట్ర: గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఎన్నుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం సాయంత్రం పెనుమంట్ర మండలంలోని మాముడూరు, పాలమూరు గ్రామాల్లో ఎన్నికల శంఖారావం పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వీధివీధికి వెళ్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయడం ద్వారా పార్లమెంట్‌కు గూడూరి ఉమాబాలను, ఆచంట అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న మాముడూరు గ్రామ ప్రధాన సమస్యలను రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పర్చామని అదేవిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి బడుగు, బలహీన వర్గాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చామని చంద్రబాబు, పితాని సత్యనారాయణ మాయమాటలు నమ్మి సంక్షేమ పథకాలను దూరం చేసుకోవద్దని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్‌లు గూడూరి దేవేంద్రుడు, కాకర రాజేశ్వరరావు, మండల పరిషత్ 1,2 ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, ఈది అనిత, సొసైటీ అధ్యక్షులు దాట్ల చంటిరాజు, కలిదిండి సుబ్రహ్మణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రకటనపై శ్రేణుల సంబరాలు



పాలకొల్లు అర్బన్: పెదగోపురంలో శ్రీక్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న గుడాల శ్రీహరి గోపాలరావు దంపతులు



పెనుగొండ: తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు స్వీటు తినిపిస్తున్న నాయకులు



పెనుగొండ: కొడమంచిలిలో బాణసంచా కాలుస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ అభ్యర్థిగా గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించగానే పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. గోపికి పూలమాలలు వేసి స్వీట్లు తినిపించారు. బాణసంచా కాల్చారు. ముందుగా అడవిపాలెం శ్రీ వినాయకుని దర్శించుకుని పూజలు చేశారు. అదే గ్రామంలో చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయించుకున్నారు. అనంతరం పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని గుడాల శ్రీహరి గోపాలరావు - మంగతాయారు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ అర్చకస్వాములు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి వీరవాసరం మండలం నందమూరుగరువు వెళ్లి శ్రీ ఆంజనేయస్వామికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుడాల గోపి స్వస్థలమైన వీరవాసరం మండలం తలతాడితిప్ప గ్రామంలో ఆయన నిర్మించిన శ్రీ రామాలయంలో సీతారామలక్షణ, ఆంజనేయస్వామివార్లను దర్శించుకున్నారు. తల్లితండ్రులు సింహాచలం-విజయలక్ష్మి దంపతులు కాళ్లకు నమస్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పెదగోపురంలో విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించి అసెంబ్లీ టికెట్ ఇచ్చిన సీఎం జగన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి విజయం సాధించి సీఎం జగన్‌కి బహుమతిగా అందిస్తానన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఆర్థిక, మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ వసుం సత్య కల్యాణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ సీనియర్ నాయకులు అడబాల వెంకటరమణ, ఎం.మైఖేల్‌రాజు, ఉచ్చుల స్టాలిన్, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ ఉన్నారు.

మిన్నంటిన సంబరాలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మరోసారి చెరుకువాడ శ్రీరంగనాథరాజును ప్రకటించడంతో గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. శనివారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు స్వీట్లు పంచి, అభినందనలు చెప్పారు. ఇడుపులపాయలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ శ్రీరంగనాథరాజు పేరు ప్రకటించడంతో తూర్పుపాలెం కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ,సీఎం జగన్, జై రంగరాజు నినాదాలతో హోరెత్తించారు. కొడమంచిలి, ఆచంట, వడలి, పెనుగొండ, మార్టేరు, పెనుమంట్రల్లో బాణసంచా కాల్పులుతో హోరెత్తించారు. కొడమంచిలిలో కార్యకర్తలు శ్రీరంగనాథరాజు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

పాలకొల్లులో మంత్రి బొత్స సందడి



గుడాల గోపి, గుణ్ణం నాగబాబులతో ముచ్చటిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో శనివారం రాష్ట్ర విద్యాశాఖామాత్యులు బొత్స సత్యనారాయణ మేనల్లుడు గౌతమ్–హిమబిందుల వివాహ నిశ్చితార్థ వేడుక నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి బొత్సా పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అలాగే రాష్ట్ర సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు మంత్రి బొత్స సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

బ్లడ్ గ్రూప్స్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీతన బ్లడ్ గ్రూపుపై అవగాహన ఉండాలని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, హెల్త్ కేర్ సెంటర్, జేసిఐ, శ్రీ విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ మన బ్లడ్ గ్రూపు ఏమిటో తెలియడం వల్ల ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడానికి ఎందగానో ఉపయోగపడుతుందన్నారు. కొమ్ముల మురళీకృష్ణ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ఎప్పుడూ ముందుండాలని కోరారు. కార్యక్రమంలో జేసీఐ చైర్మన్ మీనా మణిదీప్తి, కశ్యప్ సంతోష్, పి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాలలో శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

నరసాపురం: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు జీవితం ఆదర్శనీయమని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. శనివారం కళాశాలలో పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.నీరజ, ఎన్ఎస్ఎస్ పీవో కె.రజనీకుమారి పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జివిఎస్‌విఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు 123వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీఖాకొల్లు మైథిలి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు రాష్ట్రానికి ఆదర్శనీయమని అన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద, ఆర్యవైశ్య కళ్యాణ మండపం, తహసీల్దార్ కార్యాలయం, మన్యం జగ్గమ్మ సత్రం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, క్లబ్ సభ్యులు మాటూరి నరసింహమూర్తి, పచ్చిగోళ్ల సత్యనారాయణమూర్తి, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, యిమ్మిడి రాజేష్, ఆర్య వైశ్య సంఘ సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు, నాళం బాపిరాజు, రేపాక ప్రవీణ్‌భాను పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన



భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాలశ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: మేడపాడు గ్రామంలో శ్రీ ధన్వంతరీ మెడికల్ షాప్స్ అసోసియేషన్, పీఎంపీ అసోసియేషన్స్ భవనాలకు ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఆ స్థలంలో భవన నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలను ప్రారంభిస్తే, కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు, స్థలం కేటాయించిన సర్పంచ్ గంటా శాంతకుమారి, పంచాయతీ పాలకవర్గానికి, గ్రామ పెద్దలకు రెండు అసోసియేషన్స్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకొల్లు ఏఎంసీ డైరెక్టర్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గంధం సత్యకీర్తి, అడబాల రామ్మోహనరావు, రావూరి మురళీకృష్ణ మెడికల్ షాప్స్ అసోసియేషన్ నాయకులు కుమ్మరపురుగు సూర్యనారాయణ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు గుబ్బల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో పోలీసుల కవాతు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిద్ధాంతంలో పెనుగొండ పోలీసులు ఆధ్వర్యంలో కేంద్రబలగాలు కవాతు నిర్వహించాయి. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దంటూ అవగాహన కల్పించారు. పెనుగొండ సిఐ నక్కా రజనీకుమార్, ఎస్సై ఎస్‌కే సుభానీలు పాల్గొన్నారు.

దళితులు, బలహీన వర్గాలకు అండగా జగనన్న



కాజ తూర్పులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

యలమంచిలి: దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం కావాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ పిలుపునిచ్చారు. కాజ తూర్పు పంచాయతీ అంబాలచెరువుగట్టు ప్రాంతానికి వచ్చిన ఇజ్రాయిల్ స్థానికులతో ముచ్చటిస్తూ దళితులు, బడుగు, బలహీన వర్గాలతోపాటు మైనారిటీలకు 50 శాతం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు కేటాయించిన ఘనత జగనన్నదన్నారు. ఏ కులమైన అభివృద్ధి చెందాలంటే వారికి రాజ్యాధికారం ముఖ్యమన్నారు. నిమ్నవర్గాల ప్రజలకు రాజ్యాధికారానికి దగ్గర చేస్తున్న జగనన్నకు ఆ వర్గాల ప్రజలంతా కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా బాసటగా నిలవాలని ఇజ్రాయెల్ కోరారు. ఆయన వెంట కాజ తూర్పు గ్రామ ఉప సర్పంచ్ కోడెల్లి బుజ్జిబాబు, జేసీఎస్ జిలా ఇన్‌చార్జి ఖండవల్లి వాసు, యలమంచిలి మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు లంక చిరంజీవి వైఎస్సార్ సీపీ నాయకులు తెన్నేటి సాల్మన్, కోడెల్లి చంటిబాబు, దిగమర్తి ధర్మారావు ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



ఆచంటలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో 451 మందికి ఎన్నికల శిక్షణ ఇచ్చినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. శనివారం ఆచంట నియోజకవర్గంలోని ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో రోజు శిక్షణ ఇచ్చారు. మాక్ పోలింగ్ నిర్వహణ, ఫామ్‌లను పూరించడం, ఈవీఎంలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరంలో పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, ఆచంట మండలంల్లోని 451 మందికి శిక్షణ ఇచ్చామని వివరించారు. ముందుగా శిక్షణ పొందిన 9 మంది ఉపాధ్యాయులు వీరికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ శిబిరాన్ని ఆచంట తహసీల్దారు ఐపీ శెట్టి, ఆచంట ఎంపీడీవో పి.నరసింహప్రసాద్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

పేదలకు సొంతింటి కల సాకారం



కేపీ పాలెం నార్త్‌లో రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న నాయకులు

మొగల్తూరు: పేదలకు సొంతింటి కల సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని సర్పంచ్ కడలి సోంబాబు తెలిపారు. వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ హక్కు పథకంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు దస్తావేజులను పంపిణీ చేశారు. శనివారం మండలంలోని కేపీ పాలెం నార్త్ గ్రామంలో సుమారు 18 మంది లబ్ధిదారులకు పూర్తి భూహక్కులు కల్పిస్తూ జారీ చేసిన దస్తావేజులను అందించారు. ఎంపీటీసీ సభ్యుడు డీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడాలి

యలమంచిలి: భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను కాపాడుతూ, వారికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను 100 శాతం వారికే ఖర్చు చేస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకే మాల మహానాడు అండగా ఉంటుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ చెప్పారు. మండలంలోని అడవిపాలెం గ్రామంలో శనివారం మాల మహానాడు పాలకొల్లు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మాల మహానాడు నియోజకవర్గ కార్యదర్శి కలిగితి శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు కర్షి జోగయ్య, మోకా నరసింహారావు జిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు, బుంగ జయరాజు, భూపతి లక్ష్మణ్, గెడ్డం శంఖరరావు పాల్గొన్నారు.

భజన మండపం పనులకు శంకుస్థాపన



భజన మండపానికి శంకుస్థాపన చేస్తున్న టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో ఉన్న గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ ఆలయ భజన మండప నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. టీటీడీ నిధులు రూ.10 లక్షలు ఈ భజన మండపానికి తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు మంజూరు చేయించారు. శేషుబాబు భజన మండప నిర్మాణ భూమి పూజలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు గంటా వెంకన్న, వాకా సత్తిబాబు, కుక్కల శ్రీనివాస్, మేకా దుర్గారావు, నడపన తాతాజీ, దొడ్డిపట్ల సత్యనారాయణ, అంగర రవికుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 70 కేసుల పరిష్కారం

పాలకొల్లు సెంట్రల్: ఇరువురికీ అంగీకారమైన అప్పీలు లేని తీర్పును లోక్ అదాలత్‌లో పొందవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ అన్నారు. శనివారం న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ మొత్తం 70 కేసులు పరిష్కారం అవ్వగా రూ.50.02 లక్షలు నగదు కక్షిదారులకు పరిహారంగా అందించన్నారు. కక్షిదారులు పట్టుదలలకు పోకుండా ఆమోదయోగ్యమైన పరిష్కారానికి ముందుకు రావడం వల్ల వారి సమయంతో పాటు నగదు కూడా ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, సైమన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తలుపుల శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ సీఐలు కె. మంగాదేవి, కె. సతీష్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ తరఫున పలువురు రోగులకు శనివారం స్థానిక వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో ఆర్థిక సహాయం చెక్కులను కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు అందజేశారు. ఆటో ప్రమాదంలో గాయపడ్డ గంటా శ్రీను (భట్లమగుటూరు) రూ.30వేలు, ఆర్ మల్లికార్జున రావు (పెదమల్లం) రూ.20వే లు, గుడాల విష్ణుమూర్తి (పెనుగొండ) రూ.10వేలు, పి.రాము (ఏలూరు) రూ.10వేలు, గొన్న సతీష్ (పోడవరం) రూ.10వేలు, ఎస్.వరలక్ష్మి (కమలంపూడి) రూ.20 వేలు ఆర్థిక సహాయం చేస్తూ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి నరసింహరాజు, పి శ్రీనివాస హరినాథ్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పట్టణంలో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు తొలగింపు కార్యక్రమం మొదలు పెట్టారు. శనివారం సాయంత్రం నుంచి ఎన్నికల నగారా మోగడంతో మునిసిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు రాజకీయ, ప్రభుత్వం పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించే కార్యక్రమం మొదలుపెట్టారు. అలాగే గాంధీ బొమ్మల సెంటర్‌లో ఉన్న విగ్రహాలకు ముసుగులు వేశారు. లాకు సెంటర్ పూలపల్లి మలుపు నుంచి ఫ్లెక్సీలను తొలగించుకుంటూ రాత్రికి యడ్లబజారు సెంటర్ వరకూ ఫ్లెక్సీలను తొలగించారు. టీపీఎస్ త్రినాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

నరసాపురం: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పనున్న బకాయిలు ఈ నెలాఖరులోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి వడ్డీ యథావిధిగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ విషయాన్ని గమనించి ఆస్తి పన్నులు నీటి కుళాయి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు చెల్లించాలని చెప్పారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



కేపీ పాలెం నార్త్‌లో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మండలంలోని శేరేపాలెం, పాలకమ్మచెరువు, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్, మొగల్తూరు పంచాయతీలోని కొత్తకాయలతిప్ప, నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం తదితర ప్రాంతాల్లో పంటబోదెలు తవ్వుతున్నారు. శనివారం కేపీ పాలె నార్త్‌లోని రాజుగారి ఒడ్డు ప్రాంతం నుంచి బ్యాంక్ రోడ్డు వరకూ శివారు ప్రాంతంలోని ప్రతి ఎకరాకు నీరందెలా పంట బోదెల్లో నిలిచిపోయిన మట్టిని తవ్వి, గుర్రపుడెక్క తొలగించే పనులు చేపట్టామని టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధి కూలీలకు నిత్యం పని కల్పించేందుకు పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ శామ్యూల్ జాన్

మొగల్తూరు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు. శనివారం మండలంలోని పాతపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. ప్రతి విద్యార్థి ఒత్తిడికి గురికాకుండా పది పరీక్షలకు మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పది ఉన్నత పాఠశాలల నుంచి 620 మంది, ఆరు ప్రైవేటు పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. వీరిలో తెలుగు మీడియంలో 263 మంది, ఇంగ్లిష్ మీడియంలో 507 మంది విద్యార్థులున్నారన్నారు. మొగల్తూరు మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముత్యాలపల్లి, కేపీ పాలెం, జగన్నాథపురం, మొగల్తూరు ఉన్నత పాఠశాలలో ఏ,బీ సెంటర్‌లను శేరేపాలెం ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు చేశామన్నారు.